# ★ నా యవ్వనం ★

ఘంటా

అయ్యగార్ని చూడ్డానికి నేను పడ్డ అవస్థలు పగవాడిక్కూడావద్దని మనస్ఫూర్తిగా కాకపోయినా నోటివాక్కుతో చెప్పడానికి నాకేమీ అభ్యంతరం లేదు. రిపబ్లికు దినోత్సవంనాడు ఒక అజాన బాహుని భుజాలపుణ్యమా అంటూ ప్రెసిడెంటు గారి ముఖదర్శనమైన చేసుకోగలిగేను, గాని అయ్యగారి దర్శనం మాత్రం చాలాకాలంవరకు తీరని కోరిగ్గానే ఉండిపోయింది. అందులోను అదినా మొదటిప్రయత్నము అవడంమూలాన, అయ్యగారి దర్శన భాగ్యం కలగాలేగాని ఉద్యోగం దొరక్కపోదు అన్న ధీమాతో పట్టు పట్టుకు కూర్చున్నాను.

నేను ఆఫీసుగేటుకు ఎడమప్రక్కగా నిల్చున్నపుడు అయ్యగారు కుడిగాచూస్తూ పోయేవాడు కుడిగా నిల్చున్నపుడు ఎడంగా చూస్తూ పోయేవాడు, ఎదురుగా నిల్చున్నపుడు పైకిచూస్తూ పోయేవాడు నేను పెట్టే నమస్కారాలన్నీ ఆయన స్వీకరించినా స్వీకరించక పోయినా నాకేమంత పట్టింపులేదుగాని, నా జోడించిన చేతులు తూర్పుముఖం తిరగకుండా మట్టుకు జాగ్రత్తపడేవాడిని. ఎందెందు వెదకిచూచినా అందందే ఉండే శక్తినాలో ఏకోశాన్నైనా పుండకపోతుందా అన్న నమ్మకం లేకపోలేదు. ఆఫీసు దగ్గర ఆయన దర్శనం అసంభవమని నేను తెల్సుకోలేదు గాని, ఇంటిదగ్గరి ప్రయత్నం ఇంతకంటె సులభమయిందేమో చూదామని ఇంటి ఉనికి పసిగట్టేను.

ఇంటి సమీపంలో గంటల తరబడి నిల్చుంటే మనమూతిపళ్లు పూర్తిగా రాలిపోతాయని కొంచెం దూరంలో ఉన్న బ్రిడ్జిని ఆడబోయే నాటకానికి రంగస్థలం చేసుకున్నాను.

అయ్యగారు ఇంటికి చేరుకునే సమయానికి ఒక పావుగంట ముందేవెళ్ళి, ఇస్త్రీ బట్టలునలిగిపోకుండ శరీరాన్నంతా బిగపట్టుకుకూర్చున్నాను. మసకచీకటి పడుతోంది, కొంచెంసేపు లేచి నిల్చోటానికి ధైర్యం లేక కాదుగాని, ఉన్న కాస్త ధైర్యం పోగొట్టుకోవటం దేనికా అని అలానే కూర్చుండిపోయాను,

అయ్యగారి ఇంటిమీదుగావచ్చే పూల పరిమళాన్ని ఆఘ్రాణించటానికి ముక్కు తహ తహ పడుతున్నా ముక్కుకు ఎక్కువపని పడితే కన్నుదాని విద్యుక్తధర్మాన్ని మరచిపోయి అయ్యగారిరాకను కనిపెట్టలేదేమోనన్న భీతిచే, ముక్కు తెచ్చే పరిమళాన్ని జ్ఞానేంద్రియాలు అందుకోకుండా చేసేను. ఒకవేళ కన్ను ఆర్పితెరిచే లోపుగా అయ్యగారు నన్నుదాటి వెళ్లెడన్న అనుమానంగూడా కొంతవరకు కలుగకపోలేదు.

చీకటి దళసరి కాజొచ్చింది. రంగుబట్టలు చీకట్లో కలిసిపోయినా, అయ్యగారి తెల్లబట్టలు కనుపించక పోవన్న ధైర్యం బాగా ఉండడం మూలాన, ఆరుమూరైన మూరుఆరైన ఆస్థలాన్ని వదలిపెట్టి పోదల్చుకోలేదు.

అయ్యగారి ఇంట్లోనుంచి లైటు వెలుతురు గుండా ఎవరో నావైపు నడిచివచ్చే ఛాయలు కనుపించాయి. అయ్యగార్ని గురించిన అన్ని సంగతులు అడిగితెల్సుకోవచ్చునన్న ఉబలాటంతో కొంచెం సకిలించి వచ్చేమనిషికి అనుమానం కలుగకుండ నా ఉనికిని తెలియపర్చేను.

ధోతి మోకాళ్ళవరకు ఎగగట్టి ఉండడం మూలాన, వాడు అయ్యగారి తోటమాలి అయి వుంటాడని ఊహించుకున్నాను. సంభాషణ ఏ విధంగా మొదలెట్టాలా అనుకొంటూండంగనే నన్ను సమీపించి 'ఎవరండి అక్కడ' అన్నాడు. "అ ఎవరూలేదు, నేనేలే" అన్నాను. "అంటే, ఈ ఇంట్లోఎవరికన్నా తెలిసినవారా?" అన్నాడు. 'ఇప్పటికి తెలియదుగాని, తెలుకోవల్సిన పనిఉందిలే' అన్నాను ఆరిపోయిన గొంతును తడిచేసుకుంటూ, 'అయితే, అంత సేపటినుంచి ఇక్కడే కూర్చున్నావేమి బాబయ్యా లోపలికి రాగూడదా?' అన్నాడు.

నాకు చెప్పలేనంత ఆశ్చర్యం వేసింది, పెద్ద వాళ్ళింట్లో ఉండే ఏపనివాడూ ఇంతఅప్యాయంగ పలుకరించి ఉండడం, ప్రపంచ చరిత్రలోనే కావము; లోపలికిరానందుకు నన్ను తప్పుపడుతున్నాడేమో అనుకొని "అయితే ఇంట్లోనే ఉన్నారా?' అన్నాను "లేకేమండి, మిమ్మల్ని ఐదు గంటలనుండి ఇక్కడ కూర్చోటం చూచి, కదలరేమా అని నవ్వుతున్నారు" అన్నాడు, ఇంత కాలం పలుకరించక పోయేనే ఆ వుదారస్వభావుణ్ణి అని నన్ను నేనే దూషించుకొని వాడిని వెంబడించేను, ఎందుచేతనో కాళ్లు భూమిమీద తేలిగ్గా నడకసాగించేయి, భూమిమీదనుండి కాళ్లు నన్ను పైకి లేవనెత్తకముందే ఇల్లుప్రవేశించేను, అదృష్టవశాత్తు ఆవేళనేను వెస్తుతొడుక్కోకుండా ఉన్నట్లయితే చొక్కామార్చవలసి వచ్చేదేమో, వాడు నాకొక చక్కనిగది చూపెట్టాడు. అటువంటిగది, అందులోఉండేలాంటి సామాను నేను అంతవరకు చూడలేదు అని ఎవరన్నా అంటే ఒప్పుకోనుగాని, నాఅంతటనేనైతే ఒప్పుకుంటాను కొంచెం యాదమరిస్తే ఆసోఫాలోనే నాశరీరాన్ని వదిలేసి, ప్రాణం పైపైకి అలా స్వర్గసీమలోకి లేచిపోతుందేమో అని, ఎవ్వరికితెలియకుండ కుర్చీ చెవిని గట్టిగా పట్టుకు కూర్చున్నాను.

ఇంకేముంది. కాళ్ళచప్పుడుగూడ వినిపించింది. నాప్రయాస ఫలింపజేసే పుణ్యకాలం సమీపించిందన్నమాట. గదంతా చీకటిగామారి (నాదృష్టిలో) యధారీతికి వచ్చేలోగా ఒక నవ యవ్వన శోభిత, జగదైక సుందరి నాముందు ప్రత్యక్షమయింది. 'స్వప్నసుందరి' చూచినప్పుడే నా నరాలు కొంచెం సడలినట్లయింది, యదార్థ జీవితంలోగూడ 'స్వప్నసుందరులు' ప్రత్యక్షమవుతారని ముందుగానే తెలిస్తే కాఫీగూడ మానుకొని సినిమాకువెళ్ళి నిద్రచెరుపుకొని ఉండేవాణ్ణిగాదు.

అయ్యగార్కి బిడ్డలులేరు అని విని ఉండటం మూలాన ఆమె తప్పకుండ అమ్మగారే అయి వుంటుందని స్థిరపర్చుకున్నాను ఇంకేవేవో అనుకున్నానుగాని, వాటినన్నిటిని ఇప్పుడే తెలియపరిస్తే లోకం దృష్టిలోనొక గాలిమేడల నిర్మాతగా పరిగణింప బడతానేమో కాబట్టి తెలియపర్చను. నా వెర్రిమొర్రి ఆలోచనలతో మర్యాదగూడ మర్చిపోయేనేమో అని చెవిని ఒక్కసారి గట్టిగాగిల్లి లేచి నిల్చొని చేతులు జోడించేను. అమ్మగారు నవ్వింది. మళ్లీ రూమంత చీకటయింది. వెలుతురును కనుగొనేలోగా, నాముందొక టీట్రే, ఎదురుగా అమ్మగారు తయారు ఇంక పిచ్చి ఆలోచనలతో కూర్చుంటే నా నిజస్థితి తెలిసినప్పుడు కాబోయే పర్యవసానాన్ని ఊహించుకొని 'నాకు ఇంత గౌరవం తగదేమో!' అన్నాను. అమ్మగారు చిరునవ్వు పెదవులపై తాండవమాడ 'మేముచేయగలిగిందే ఇంత మిమ్ము తగినట్లు గౌరవించటానికి మేముచాలమేమో' అంది. ఇంకేముంది కొంపమునిగింది. నా స్పెషల్ వాషింగ్ సూటును చూచి ఏ పెద్దఉద్యోగస్తుడో అనుకొని ఈవిధంగా గౌరవిస్తోంది అనుకున్నాను నిమిషాలమీద నేనెవర్నో తెలియపర్చకపోతే ఫర్లాంగు పొడుగు కాంపౌండును సెకెండ్లమీద దాటవలసి వస్తుందేమోనని 'నేనెవర్నని మీఅభి

ప్రాయమో తెల్పుకోవచ్చునా?' అన్నాను. నా కంటికి కనిపించినంతవరకు మీరొక పురుష యువకులు అంది. ఇదెక్కడి ఖర్మరా భగవంతుడా! పురుషయువకుణ్ణట. 'పురుషుడు' అనగూడదా - లేక యువకుడు అనగూడదా? అనుకున్నాను. నేను వచ్చిన సంగతి మర్చిపోలేదుగాని అసమాసానికి ఆమె ఏ అర్థం చెప్పుతుందో తెల్సుకోవాలని 'పురుషయువకుడు ఏమిటండి? నేను చదివిన పుస్తకాల్లో ఎక్కడ ఆసమాసము తగల్లేదే' అన్నాను. 'ఉష్ ఇంతేనండి ఇంతదీర్ఘంగా ఆలోచిస్తున్నారు. అంటే పదహారణాల పురుష జన్మఎత్తి యువకదశలో ఉన్న మగవాడు అన్న మాట' అని ఒక్కగంతులో ఆగదినుండి ఎగిరి పోయింది.

మళ్లీ ఆలోచనలో పడ్డాను. దారితప్పి ఇంకేదో ఇంటికి వచ్చేనేమోనన్న అనుమానం కలిగింది కాని నేను అడిగిన ఇద్దరు ముగ్గురు అయ్యగారియిల్లు ఇదేనని చెప్పియుండడం మూలాన నా అనుమానానికి ఆస్కారం లేకుండ పోయింది. అమ్మగారిక్కి కామసూత్రాల్ని ఏకరువు పెట్టటానికి వ్యవధి ఎక్కడిదా అనివిస్తుపోయేను. తోటమాలివచ్చి "ఏమండీ ఆలోచన్లతోనే తెల్లవార్చేలాగున్నారే" అన్నాడు "అయితే అయ్యగారింకా రాలేదన్నమాట" అన్నాను వాడునవ్వి "అదేమి భయములేదులెండి, అయ్యగారు ఇవ్వాళ రానని కబురంపేరు" అని పువ్వుల బుట్టను బల్ల మీదవుంచి వెళ్ళిపోయేడు. "ఓరీ మహాపాతకి ఇదేమి పనిరా?" అందామనుకున్నాను గాని అంతలోనే ఒక్కొక్కపువ్వు నామీదికి దూసుకురావటం మూలాన నోరుమూసుకుని చేతులకి పని పెట్టేను. ఇంతవరకు వచ్చిన తర్వాత ముసుగులో గుద్దులాట దేనికా అని సోఫామీదనుంచి లేచేను. "ఓ స్త్రీ యువతీ నీ వృత్తాంతం చెయ్యది? నీ యీ చేష్టలకుగల కారణంబించుక ఎరిగింపవా?" అన్నాను, సుందరికి సిగ్గేసింది కాబోలు ముసుగు సరిచేసుకొని "నా వృత్తాంతం తెలియపర్చటం అంత అవసరమా" అంది దీనంగా, "నీకు అభ్యంతరం లేకపోతే నేను విని సంతోషిస్తాను" అన్నాను. విన్నటినుండి నేను అయ్యగారి ఉంపుడుగత్తెని. నన్ను, నా సౌందర్యాన్ని ఈయన డబ్బిచ్చి కొనితెచ్చుకొని నా కొరకై ప్రత్యేకంగా ఈ సౌధాన్ని ఖాళీచేసి తాను భార్యాసహితంగా అద్దెకొంపలో ఉంటున్నారు" అంది. నాకొక షాకు. కొత్తగా తెచ్చుకున్న అయ్యగారి ముద్దుల భార్యతో నేను ఉద్యోగానికై ఆయన్ని చూడడానికి వచ్చిననేను - ఏకాంతంగా సరససల్లాపాలాడడమా? ఇటువంటి సంఘటనే ఇదివరకెక్కడైన జరిగిఉండి అది పుస్తకాల్లో ఎక్కిఉన్నట్లయితే దాన్ని ఊతగాజేసికొని నేను నా భావికార్యక్రమాన్ని నిర్ణయించుకొనే వాడిని. తర్వాత చేయవలసినదాన్ని గురించి ఆలోచించుకొంటూ ఉండగనే తలుపుచప్పుడైంది. నా భుజాలు పైకిలేచినట్లు లోపలివెస్టు మళ్లాతడిని గ్రహిస్తూ ఉన్నట్లు బాగా జ్ఞాపకం.

సుందరి నావైపు కనుగీటి తలుపుతీసింది. నేనంతవరకు కోరుకుంటూఉన్న ఉద్యోగప్రదాత నాపాలిట మరణప్రదాతవలె లోపలప్రవేశించేడు. అయ్యగారిక్కి కనుబొమ్మలు నిక్కబొడిచేయి. మీసాలదారిలో చేయి సగమువరకు ప్రయాణము చేస్తూ ఉండగనే సుందరి నావైపుతిరిగి "వీరే కన్నయ్యా అయ్యగారంటేను చూడాలంటున్నావు గదూ?" అంది. నేను రెండుచేతులు జోడించి చేయవలసిన పని చేసేను. అయ్యగారు మీసాల దారిలో ఉన్న చేతినిదింపి 'ఐసీ ఇతనే నేమిటి మద్రాసులో చదువుతూ ఉన్నాడన్నారు' అన్నాడో లేదో నేను ధీమాగా 'ఔనండి ఇవ్వాళ మద్రాసునుండి అత్యవసరమైన పనిమీదవచ్చేను' అన్నాను. "నాకు మద్రాసు వెళ్ళవలసిన పని ఉందిగాని బండి తప్పిపోవడం మూలాన వెళ్ళ లేదు అన్నాడు అయ్యగారు. "అసంగతే ఇప్పుడుచెప్పుకుంటున్నాము" అన్నాను. "అత్య

సరమైన పనిమీద వచ్చేనన్నావుగదూ, మాట్లాడుకొండి; చాలాకాలానికి కలిసినట్లున్నారు. " అని మర్యాదతెలిసిన అయ్యగారు వెనకడుగు వేసేరు. " మాకు అత్యవసరముండే గాని మీరుతల్చుకుంటే నిమిషాలమీద తేలి పోతుందిలెండి " అన్నాను నసుగుతూ. 'చల్లకొచ్చి ముంతదాచడం దేనికోయ్, డబ్బేమైన అవసరమా? ' అన్నాడు. నేను చేతులు నలుపుకుంటూ సుందరి-వైపుచూచేను. సూక్ష్మదృష్టిగల సుందరి నాపరిస్థితినంతా అవగాహన చేసుకుందో ఏమో " ఇస్ అంటే రోకటి పోటని తెలియదా అండి, చదువు ముగించుకొని పనిపాటలేకుండ ఉన్నాడిప్పుడు." అంది. అయ్యగారు ఇంటికప్పు లేచిపోయేటట్లు నవ్వి 'ఓస్ ఇంతేనటోయ్ గోరంతదాన్ని కొండంత చేసి చెప్తున్నావు; ఎక్కడో పని చేయడమేమిటి. మన ఎకౌంట్సుచూస్తూ ఇక్కడే ఉండు అన్నాడోలేదో సుందరికి తలనొప్పివచ్చింది. అయ్యగారు సుందరి భారాన్నంత నామీద వదిలి వెళ్ళిపోయేడు, నేనుసుందరి రెండుచెవులు పట్టుకొని పైకెత్తి " అన్నయ్య ఎవరిక్కడ, అబద్ధాలకోరా! " అన్నాను. సుందరి నాపట్టు తొలగించుకొని " మీకు చెవులుచెడిపోతే రేపుడాక్టరు పరీక్ష చేయించుకొండి; కన్నయ్యకు అన్నయ్యకు భేదము తెలుస్తుంది " అంది, ఇంకేదో అంది, ఏమేమో అరిగిపోయింది. ఏమేమో జరిగిపోవడమేమిటి? ఇందులో దాపరికమెందుకు. మేమిద్దరము ఒకరినొకరు ప్రేమించుకున్నాము.

ఈ మధ్యనే అయ్యగారు జీవయాత్ర చాలిస్తూ నన్నుపిల్చి " పాపం సుందరికి నావద్దకువచ్చిన దగ్గరనుండి ఒకటే తలనొప్పి- ఏదైనమార్గం ఆలోచించి దాన్ని పోగొట్టి పుణ్యం కట్టుకో " అన్నాడు. తప్పకుండ పోగొడ్తాను, అనిఆయనకు మాటఇచ్చి, ఆమాటను అక్షరాలా నిలబెట్టుకున్నాను.


